క్లుప్తంగా

ప్లాస్టిక్‌ను నిషేధించండి



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పాల్వంచ: మానవాళికి, జీవరాశులకు హాని కలిగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి అన్నారు. శుక్రవారం ఇండియన్ స్వచ్ఛత లీగ్, స్వచ్ఛత హై సేవా కార్యాక్రమంలో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌ను వీడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మరుగుదొడ్లను తప్పనిసరిగా వాడాలని, తడి,పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, ఫరీద్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పర్యవేక్షణ



పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ సత్యనారాయణ

చుంచుపల్లి: మండలంలో శుక్రవారం డ్రై డే - ఫ్రై డే సందర్భంగా విద్యానగర్, రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, చుంచుపల్లి తండా, నందా తండా, బాబు క్యాంప్, ఎన్‌కే నగర్ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఎంపీఓ సత్యనారాయణ పర్యవేక్షించారు. ప్రస్తుతం గ్రామపంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో చేపడుతున్న కార్యక్రమాలపై తగు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇందిర, బాబురావు, సత్యనారాయణ, రవి, వెంకటేశ్వర్లు, భూమిక, వసంత కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలలో 'కుల నిర్మూలన' చేర్చాలి

ఇల్లెందు: దేశంలో కులం ఒక జాఢ్యంగా మారిందని, దీనిని నివారించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, పాఠ్య పుస్తకాలలో కుల నిర్మూలనా అంశాలు చేర్చాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జే.గణేష్ అన్నారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కుల నిర్మూలన సత్యశోధ సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా ఇల్లెందులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్మ జ్యోతీబా పూలే బడుగు బలహీన వర్గాల కోసం ఆహర్నిశలు కృషి చేశాడని తెలిపారు. కుల సమస్యను తీవ్రంగా వ్యతిరేకించారని, అందులో భాగంగానే సత్యశోధక్‌ను స్థాపించారని గుర్తు చేశారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన రమేశ్ తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. క్లబ్ అధ్యక్షుడు చేపూరి బ్రహ్మాచారి రూ.50వేలు అందించారు. క్లబ్ కోఆర్డినేటర్ ఆరుద్ర సత్యనారాయణ, మాడిశెట్టి రాజమనోహర్, పుట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు అమలు చేయాలి



సంఘీభావం తెలుపుతున్న శ్రీనివాస్

ఇల్లెందురూరల్: మధ్యాహ్న భోజన వర్కర్లకు గతేడాది మార్చి 15న సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.3వేల వేతనం ఏరియర్స్‌తో కలిపి వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నబీ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా మధ్యాహ్న భోజన వర్కర్లు ఎంఈఓ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వర్కర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని, గుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని టీపీటీఎఫ్ నేత పిల్లి శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సుల్తానా, సరిత, మాధవి, అన్నపూర్ణ, సువర్ణ, కౌసల్య, ఈసం భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ

పాల్వంచరూరల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీ.రంగాకిరణ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, చింతలచెరువు శ్రీనివాసరావు, మానుపూరి ప్రభాకర్, రాపాక రమేష్, కటికల రంజిత్, గంగపూరి దుర్గాప్రసాద్, అలువాల సందీప్, బొమ్మనేని క్రాంతి, కల్యాణ్, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థినుల నడక యాతన

- హాస్టల్ నుంచి ప్రతిరోజూ మూడు కిలోమీటర్లు కాలేజీకి నడవాల్సిందే
- పట్టించుకోని అధికారులు, పాలకులు



హాస్టల్ నుంచి కళాశాలకు జాతీయ రహదారిపై వెళ్తున్న గిరిజన విద్యార్థినులు

పాల్వంచరూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను డాక్టర్ చేయాలనో, ఇంజనీరు చేయాలనో, సైంటిస్టు చేయాలనో కలలు కంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి చదిన తర్వాత పట్టణంలోకి వెళ్లి ఉన్నత చదువులు చదువుకోవాలని మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల బిడ్డలు చదువుల కోసం నడక యాతన పడుతున్నారు. పాల్వంచ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌కు సమీపంలో ఉన్న గిరిజన విద్యార్థినుల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ ఉంది.

ఇందులో జిల్లాలోని గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన 300 మంది నివాసం ఉంటూ వివిధ కళాశాల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకుంటున్నారు. హాస్టల్ నుంచి వారు కళాశాలలకు వెళ్లాలంటే ప్రతిరోజూ మూడు కిలోమీటర్లపైన నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సిందే. హాస్టల్ నుంచి లక్ష్మీదేవిపల్లిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో కొంతమంది, వీరునాయక్ తండా సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరికొంతమంది గిరిజన విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఆయా కళాశాలలకు వెళ్లాలంటే విద్యార్థినులు గంట ముందే హాస్టల్ నుంచి కాలినడక ప్రారంభించాలి లేదంటే కళాశాలకు చేరుకోలేని పరిస్థితి.

జాతీయ రహదారిపైనే నడక...

గిరిజన విద్యార్థినులు తాము ఉంటున్న హాస్టల్ నుంచి నిత్యం వాహనల రాకపోకలతో రద్దీగా ఉండే బీసీఎం జాతీయ రహదారి మీదుగా కళాశాలకు నడుచుకుంటూ వెళ్తుంటారు. విద్యార్థినులు గుంపులుగా మాట్లాడుకుంటూ రోడ్డు పక్కన నుంచి కళాశాల వెళ్తుంటే వాహనల నుంచి ప్రమాదం పొంచి ఉంటుందని తెలిసినా గత్యంతరం లేని పరిస్థితిలో కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి..

నిత్యం కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థినులకు నడక నుంచి విముక్తి పొందాలంటే ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించి భద్రాచలం, బూర్గంపాడు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను హాస్టల్ వద్ద స్టాప్ ఏర్పాటు చేస్తే విముక్తి లభిస్తుంది. ఈ విషయమై గత కలెక్టర్ అనుదీప్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. కానీ విద్యార్థినులకు ఉచిత బస్ పాస్‌లు ఇప్పించే వారులేక పోవడం, అధికాలు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోకపోవడంతో నడక తిప్పలు తప్పడం లేదు.

ఐటీడీఏ పీఓ స్పందిస్తేనే...

గిరిజన విద్యార్థినులు నిత్యం మూడు కిలోమీటర్ల దూరం కాలేజీకి నడుచుకుంటూ రాకపోకలు సాగిస్తున్న ఇబ్బందులపై ఐటీడీఏ పీఓ స్పందించి వసతి గృహాన్ని డిగ్రీ, జూనియర్ కళాశాలలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలి లేదా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

హైవేపై వెళ్లాలంటే భయమేస్తోంది



హాస్టల్ నుంచి జూనియర్ కళాశాలకు హైవేపై నడుచుకుంటూ వెళ్లి, తిరిగి హాస్టల్‌కు రావాలంటే భయమేస్తోంది. అయినా రోజూ మూడు కిలోమీటర్ల దూరం తోటి విద్యార్థినులతో కలిసి వెళ్లి వస్తున్నాను. బస్సు సౌకర్యం కల్పించాలి.

– ఎస్.మోహిని, ఇంటర్ విద్యార్థిని

కాలేజీకి దగ్గరగా హాస్టల్ ఉండాలి



తాను చదువుకునే ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌కు చాలా దూరంలో ఉంది. హాస్టల్ నుంచి 60 మందికి పైగా నిత్యం నడుచుకుంటూ కాలేజీకి వెళ్లి వస్తున్నాం. అధికారులు స్పందించి హాస్టల్‌ను కాలేజీకి సమీపంలో ఏర్పాటు చేయాలి.

– కె.అనిత, ఇంటర్ విద్యార్థిని

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా...



పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో ఉండి వివిధ కళాశాలల్లో చదువుకునే విద్యార్థినులు కళాశాలకు వెళ్లాలంటే దూరబారమవుతున్న మాట నిజమే కానీ ఏమీ చేయలేని పరిస్థితి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

– చంద్రమోహన్, ఏటీడీఓ

మహ్మద్ ప్రవక్త సర్వమానవాళికి ఆదర్శం



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పాల్వంచ: మహ్మద్ ప్రవక్త సర్వమానవాళికి ఆదర్శం, ఆయన చూపిన మార్గం అనుసరణీయం అని మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ.ఫయాజ్ ఉల్ హాసన్ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మీలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం పట్టణంలో మార్కజ్ అహిలే సున్నత్ వల్ జమాత్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఫయాజ్ మాట్లాడుతూ.. మక్కాలో జన్మించిన మహ్మద్ ప్రవక్త కాలగతిని మార్చివేసిన శూరుడన్నారు. ఇస్లాం అనే పదంలో ముస్లింలు తమ సరస్వాన్ని భగవంతుడికి అర్పించాలనే అర్థం ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇబ్రహీం ఖురేషి, ఎస్‌కే.మీరా సాహెబ్, రఫీయుద్దీన్, ఇమ్రాన్ రజా, నవేద, ఖుషర్ అహ్మద్, జైనుల్లా బుద్దీన్, ఖాజా, కబీర్, సికిందర్, అక్బర్, కలీం, మదార్, యూసఫ్, మౌలా, బడే సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు జరగనున్న జోనల్ స్థాయి పాఠశాల క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలకు జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల హైస్కూల్స్, యూపీఎస్‌లు, కేజీబీవీ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. జెడ్పీటీసీ భూక్యా కళావతి, తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు నిర్వహించారు.

నేడు నుంచి రిలే నిరాహార దీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 30న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేట్ ఏరియా పరిధిలోని పలు ప్రాంతాలలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను విస్మరించటమే కాకుండా కార్మికుల శ్రమను దోచుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకై జరపతల పెట్టిన నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. గిద్ద శ్యాంకుమార్, సూరం అయిలయ్య, సత్రం, కిషన్ సైదమ్మ, రాణి, రాజేష్, వినోద్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పాషా మార్గంలో పయనిద్దాం..

టేకులపల్లి: విప్లవోద్యమ నాయకుడు ముక్తార్ పాషా చూపిన మార్గంలో పయనించాలని, విప్లవోద్యమం కొనసాగుతున్నంత కాలం ఆయన చిరస్మరణీయుడుగా ఉంటాడని సీపీఐ(ఎంఎల్) ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏరియా కమిటీ నాయకుడు జె.సీతారామయ్య అన్నారు. శుక్రవారం పాషా మూడో వర్ధంతి సభ బద్దు తండా గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూక్యా హర్ష్య, లక్ష్మణ్, వీరు, నర్సింగ్, శ్రీనివాస్, నామ పాల్గొన్నారు.

గుండెపోటుతో మృతి

టేకులపల్లి: గుండెపోటుతో ఆటో యూనియన్ నేత మృతి చెందాడు. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన ఆటో యూనియన్ అధ్యక్షుడు ఈసం సమ్మయ్య(45) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం స్వగ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. సమ్మయ్య మృతికి సంతాపంగా బోడు నుంచి టేకులపల్లికి నడిచే ఆటోలను బంద్ చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఎంఈఓకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: ఉద్యోగంలో అంకితభావంతో పనిచేస్తే ఎక్కడికి వెళ్లినా రాణిస్తారని ఎంపీడీఓ కోట వీరబాబు అన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం టేకులపల్లి సింగరేణి కాలనీలోని కమ్యూనిటీ హాలులో స్వాగత వీడ్కోలు నిర్వహించారు. టేకులపల్లిలో పని చేసి బదిలీ అయిన ఎంఈఓతో పాటు కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు, బదిలీపై టేకులపల్లికి వచ్చిన హెచ్‌ఎంలకు పూల మాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. టేకులపల్లిలో ఎనిమిది సంవత్సరాలు ఎంఈఓగా విధులు నిర్వహించిన ఠాకూర్ రాంసింగ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సన్మాన గ్రహీతలు మూడు రమణ, గుగులోత్ హరిలాల్, మోకాళ్ల శ్రీనివాస్‌రావు, లక్ష్మణ్‌రావు, మంగ, భాగ్యలక్ష్మి, భద్రు, మంగీలాల్, దేవదాసు, జోగ రవి, రవీందర్, మోతీలాల్, బోడ పూన్యానాయక్, బాణోతు నాగేశ్వర్‌రావు, విజయనిర్మల, మంగతాయారు, ఫూల్‌సింగ్, ముడిగ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

టేకులపల్లి: రాంపురం పంచాయతీలో వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు యువకులు జ్వరంతో మృతి చెందడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు శుక్రవారం వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 53 మందికి చికిత్స అందించారు. 27 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరబాబు, ఎంపీఓ గాంధీ, స్థానిక సర్పంచ్ ఇందిర కార్యదర్శి సందీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

'సీజనల్స్'పై అప్రమత్తంగా ఉండాలి

జూలూరుపాడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం బేతాళపాడు గ్రామ పంచాయతీ బిట్టుతండాలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

సింగరేణి(కొత్తగూడెం): దోమల నివారణకు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 10వ వార్డులో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ పంచాయతీ సిబ్బందిచే శుక్రవారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

భిక్షాటనతో అంగన్‌వాడీల నిరసన

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది నిరసన తెలుపుతూ దుకాణాల సముదాయాల వద్ద భిక్షాటన చేసి, రోడ్లను ఊడ్చారు. తమ న్యాయమైన తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: ఎంపీడీఓ వెంకటేశ్వరరావు వద్ద భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్



సుజాతనగర్: భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



టేకులపల్లిలో రోడ్లు ఊడుస్తూ నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం..



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ఆమె రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. రేగులగూడెం, చంద్రాలగూడెం, తుమ్మలగూడెం గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎడవల్లి ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. కేసీఆర్ చేసిన మోసాల నుంచి బడుగు, బలహీన వర్గాలను ఆదుకునేందుకు 6 గ్యారంటీ పథకాలను సోనియాగాంధీ ప్రకటించినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద పేద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500 వంటగ్యాస్ సిలెండర్, మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యం, ఇళ్లు లేనివారికి ఇంటి స్థలం, రూ.5లక్షల సాయం, నెలకు రూ.4వేల పింఛన్, రైతులకు ప్రతిఏటా రూ.15వేల పెట్టుబడి సాయం పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కొండం వెంకన్న, కట్టా సోమయ్య, చారి, గుండా శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, కొర్స బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం మానుకోండి



ఎస్సై గిరిధర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: అభివృద్ధి జరగలేదంటూ ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మండలంలోని పోచారం తండాకు చెందిన వాంకుడోత్ శ్రీనుపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం కొమరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభివృద్ధి జరగలేదంటూ ఎమ్మెల్యేనూ దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. కాగా, పోచారం తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు భూక్యా దేవలా, లష్కర్, కవిత మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేసిన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియపై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కోరారు. ఐదేళ్లలో నియోజకవర్గానికి రూ.1,830 కోట్ల మంజూరు చేయించగా, అందులో కొమరారం ప్రాంతానికి రూ.120 కోట్లు వెచ్చించారని తెలిపారు. నాయకులు మల్సూర్, జగన్, వీరబాబు, సుధాకర్, పెంటయ్య, మగ,బాలు, శ్రీను, స్వామి, మహేష్, సురేష్, రామ్‌చంద్, పున్నమ్మ పాల్గొన్నారు.

పొదుపు పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

పాల్వంచరూరల్: పోస్టాఫీస్ ద్వారా అమలు చేస్తున్న పొదుపు పథకాలపై పాండురంగాపురం గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్వంచ పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. మాట్లాడుతూ... పోస్టాఫీసుల ద్వారా అమలు చేస్తున్న పొదుపు పథకాలు, తపాల జీవిత బీమా తదితర సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాటి ఆవశ్యకతను వివరించారు. అనంతరం మేరీ మాటీ.. మేరా దేశ్ సందేశాన్ని తెలియజేస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మైల్ ఓవర్‌సిల్ బి.శేషు, బ్రాంచి పోస్ట్ మాస్టర్ బండి యల్లారావు, గ్రామ సర్పంచ్‌లు బి.జీవన్‌రెడ్డి, జగదీష్‌కుమార్, రమేష్, వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, తవిశలగూడెం ఉపసర్పంచ్ లింగం శ్రీను, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, పూసల విశ్వనాథం, బొల్లెపల్లి కాంతారావు, అనుబ్రోలు వెంకట్రావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకూ ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలని, 2022–23లో సంస్థ సాధించిన లాభాల్లో 30శాతం వాటా ఇవ్వాలని సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి ఇనప నూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బంగ్లోస్ ఏరియా ద్వారా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు రూ.కోట్ల లాభాల వెనక కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉందన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో కాంట్రాక్ట్ కార్మికులు 18 రోజులు వారి సమస్యల సాధనకై సమ్మె చేస్తే డీవైసీఎల్సీ సమక్షంలో యాజమాన్యం ఒప్పందం చేసిన అంశాలను అమలు చేయాలని కోరారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షురాలు దొడ్డి నిర్మల, కార్పొరేట్ ఏరియా వైస్ ప్రసిడెంట్ ఎడ్ల రాకేష్, కార్పొరేట్ ఏరియా పిట్ సెక్రటరీ గుర్రం సృజన్, పిట్టల రాజశేఖర్, మంద అజయ్, రంజిత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ఆశా కార్యకర్తల ధర్నా



జూలూరుపాడు: తహసీల్దార్ శారదకు వినతిప్రతం అందజేస్తున్న ఆశా వర్కర్లు



ఇల్లెందురూరల్: ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

జూలూరుపాడు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ శారదకు ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పూనెం ఝాన్సీ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు పారితోషికం పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వల్లమల్ల చందర్‌రావు, ఆశావర్కర్లు బి.నీలిమ, వసుంధర, దేవి, బీబీ, రామ్ని పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం తహసీల్ ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య పరిరక్షణకు శ్రమిస్తున్న ఆశా కార్యకర్తలకు అరకొర వేతనాలు చెల్లిస్తూ ప్రభుత్వం అవమానిస్తోందని ఆరోపించారు. తక్షణం స్పందించి నెలకు రూ.18వేల చొప్పున వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, పింఛన్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమాదేవి, సునిత, రమణ, చంద్రకళ, విజయ, మల్లేశ్వరి, లక్ష్మి, కరుణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం



విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. మండల పరిధి నాగారం హైస్కూల్‌లో ప్రాంగణంలో ఇనుప చువ్వలు, పెద్ద పెద్ద మొద్దులు, కర్రలు విద్యార్థులకు ప్రమాదకరంగా మారాయి. స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు తిరగడానికి ఇబ్బందికరంగా ఉన్న నెలల తరబడి హెచ్‌ఎం పట్టించుకోవడం లేదని, వాటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాలిని తొలగించి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని కోరుతున్నారు.

– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : శ్రీరామ్మూర్తి,
మండల విద్యాశాఖాధికారి
సెల్ నెంబర్: 9959585974